

# వడివేలు కథ

ఆదే ఒకరోజున రైలు పరుగెడుతోంది మెడ్రాసుకి. అందులో ఒక పెద్ద డైరెక్టరు ఉన్నాడు. మన కథకి సదుపాయంగా వుంటుందని సెకండు క్లాసులోనే ఎక్కాడు. అందులోనే ఈ వడివేలూ ఎక్కాడు. అతడు రైలు గుమాస్తా. ప్యాసులూ అవీ దొరుకుతాయి. నాటకాల్లో దారుణంగా నటించేస్తూంటే చూసి అతని స్నేహితులంతా, మెడ్రాసుపోయి

సినిమాల్లో చేరిపోరా, బాబూ అని పోరారు. అందుకని నెల్లాళ్ళు సెలవు పెట్టి, పెళ్లానికి నచ్చచెప్పి, ప్యాసు పుచ్చుకు రైలెక్కాడు.

డైరెక్టరు అతన్ని చూసి అనుమానపడి ఇది సెకండుక్లాసు అన్నాడు.

ఔను తెలుసు అని అరవంలో అని, కాస్త టెక్కునభినయించి ఎక్కిపోయాడు వడివేలు. సరే రైలు కదిలింది.

కదుల్తూ ఉండగా ఎవరో వచ్చి డైరెక్టర్ని పలకరించి ఈ పిక్చరు ఐపోగానే మళ్లారండి అనిచెప్పి వెళ్ళిపోయారు.

'మీరు డైరెక్టర్లా' అన్నాడు వడివేలు హడలిపోయి.

'కాదు. నేను ఒకణ్ణే డైరెక్టర్ని' అన్నాడు డైరెక్టరు కొంచెం ఈసడింపుగా.

తక్షణం పురాణం విప్పేసి, తన కథ చెప్పేసి దాని పొడుగునా, నవరసాలూ—ముఖ్యంగా హాస్యం అభినయించి అవతల పారేశాడు వడివేలు.

"మీరే నాకు దిక్కు" అన్నాడు.

టెక్కు సంగతి మర్చిపోని డైరెక్టరు "లాభం లేదప్పా, నాదగ్గిర క్యూలో కొన్ని వందలమంది ఉన్నారు". అన్నాడు.

వడివేలు పట్టుదల చలించలేదు. సీట్లోంచి లేచిపోయాడు ఉద్రేకంగా. జీవితం గురించి, కళగురించి, ట్రాజిడీ కామిడీ అంటూ బోల్డు అభిప్రాయాలు ప్రకటిస్తూ ఎంతో నటించాడు ఎన్నో యాంగిల్సులో.

అయినా లాభంలేదన్నాడు డైరెక్టరు.

"నేను పొద్దుట్నుంచి అన్నంతిన్లేదు. మీరు ఛాన్సిచ్చేదాకా తినను. చచ్చినా సరే" అన్నాడు వడివేలు.

"నేనెందుకు చస్తాను. నేనుచావను. కావలిస్తే నువ్వే చావు" అన్నాడు డైరెక్టరు విసుగులోనే ఒక 'బ్రిలియంట్ టచ్' పడేస్తూ.

వడివేలుకు అఖండమైన అయిడియా వచ్చేసింది.

"చావమన్నారు కదూ. ఛస్తానులెండి. అమాంతం రైలు దూకేస్తాను. ఆనక తెలుస్తుంది. మీరే తోసేశారనుకుంటారు అంతాను" అన్నాడు.

"లేదని చెబుతాగా"

వడివేలు, నంబియార్‌లా నవ్వాడు.

"ఇదేం, సినిమా అనుకున్నారా ఆఖర్ని మంచివాళ్ళే కేసు గెలవడానికి. లైఫ్ .... రియల్ లైఫ్, మీకు తెలీదు కాబోలు ఈ సూటుకేసులో టెంథౌజండ్ రూపీస్ — పదివేల రూపాయలున్నాయి. నేను రైలు దూకి చచ్చాక, ఈపెట్టి తెరిచినవాళ్ళేమనుకుంటారు ? ఆ డబ్బు కాజెయ్యడానికే మీరు తోసేశారనుకుంటారు. మీకు నల్లకళ్ళజోడు, మేక గడ్డం, నోట్లో పైపూ లేకపోయినా సరే మీరే విలనంటారు....దూకేస్తున్నా వన్ టూ త్రీ" అన్నాడు వడివేలు.

డైరెక్టరు హడలిపోయి దారి కొచ్చాడు. రాకపోతే నిజంగా దూకే వాడినే అన్నాడు వడివేలు.

ఛాన్సు ఇస్తానని మాట యిచ్చాడు డైరెక్టరు. నిజంగా ఇచ్చాడు కూడాను.

కాని గమ్మత్తు ఏమిటో తెలుసా ?

ఆ పెట్టెలో పదివేల రూపాయలూ లేవు. ఒకవేల రూపాయలు కూడా లేవు.

రెండుపీసెల పత్రికలూ, నాలుగైదు కాళీ సీసాలు ఉన్నాయి.

జేబులో డబ్బయిపోతే, చటుక్కున వాటిని అమ్మితే రెండ్రూపాయలు వస్తాయిగదా. అప్పుడు ఇంటికి టెలిగ్రామిచ్చి, ఓ కాఫీ తాగి పాట పాడుతూ బెంగెట్టుకోడానికేనా సదుపాయం ఉంటుంది. ముందు జాగ్రత్తన్నమాట. నువ్వు జ్ఞాపకం వుంచుకో. న్యూస్‌పేపర్లు బంగారు నగలవంటివి. ఆపదలో ఆదుకొనును.

ఇపుడు చెప్పు వరహాలరాజూ. నీకాధైర్యం ఉందా? కనీసం అలా బుకాయించి నెగ్గే ప్రజ్ఞ ఉందా? నీకా ఉపాయం తట్టి ఉండేదా? అన్నాడు నరసన్న కథ ముగిస్తూ.

గుడ్లప్పగించి వింటున్న వరహాలరాజు అడ్డంగా తల తాటించాడు.

'అయితే లాభంలేదు' అన్నాడు నరసన్న.

* * * *

వరహాలరాజు మొహం ముత్యం అంత అయిపోయింది.

దిగాలుగా తల వంచుకున్నాడు.

సినిమాలో ఇలాటి సీనువస్తే నేపథ్యగీతం రావాలి.

నా, ఇంతే జీవిత మింతేనా, ఈ జీవిత మింతేనా అని మాధవపెద్ది సత్యం, కొండొకచో ఎం. ఎస్. రామారావూ, రాజు పరిభాషలో "ధణుతెగర గొట్టేలా" పాడాలి.

వరహాలరాజు తలవంచుకుని చాలాసేపు చూశాడు గాని అతనికి అలాటి సదుపాయం జరగలేదు. ఇక తప్పదని తనే పెదిమలు కదలేదా మనుకుంటున్నాడు.

అంతలోకీ హఠాత్తుగా "ఇంతేలే — జీవిత మింతేలే — ఈ జీవిత మింతేలే — ఈ నీ జీవిత మింతేలే" అన్న పాట — లేక మాట, కాస్త కఠినంగా వినబడింది.

"ఛీ వరస తప్పింది. గొంతు బొంగురుపోయింది" అనుకుని పొడిదగ్గుతో సర్దుకున్నాడు రాజు.

అయినా ఆపాట వినబడింది! తల ఎత్తాడతడు.

ఆత్మహత్యకి ప్రయత్నిస్తున్న హీరోయిన్‌ని ఆపడానికి వచ్చే సినిమా సాధువులా నవ్వుతున్నాడు నరసన్న. అతని పెదిమలు కదులుతున్నాయి.

'ఓహో ఈయనా పాడుతున్నాడు. ఇంకా నేనే ననుకున్నాను వయం' అనుకున్నాడు రాజు. అనుకుని, "ఓ మీరా!" అన్నాడు.

"మీరా కాదండి. మీ ఘంటసాలదే అనుకుంటా.... తెలుగు సాంగు" అన్నాడు నరసన్న రాజుని అపార్థం చేసుకుని.

"మీరా ఎవరూ!" అన్నాడు రాజు.

"మీరా అంటే ఎం. ఎస్. సుబ్బలక్ష్మి కదండి. బ్యూటిఫుల్‌గా పాడింది. నేను పాడింది అదిగాదులెండి. తెలుగూ నేపథ్యపు సాంగు. మీకు తెలిసుండాలే. మీ ఫేసుమీద చాలా ఫీలింగు కనపడితే పాడాను."

రాజు సిగ్గు పడిపోయాడు. "ఎప్పుడూ అంతేనండి. నా ఫేసుమీద మంచి ఫీలింగులు ఉంటాయి .... ఇప్పుడు పాడింది మీరన్న మాట."

"నా పేరు మీరన్న కాదు నరసన్న .... మీకు దిగులుగా ఉంటే ఉంది కాని, అలా పరాగ్గా మాటాడి నాపేరు మార్చకండి" అన్నాడు నరసన్న కొంచెం చిరాగ్గా.

"మీరు నన్నర్థం చేసుకోవటంలేదు నరసన్నా."

"ఏవయ్యోయ్! ఎక్కడేనా బావగాని వంగతోట దగ్గర కాదన్నారు. ఈ సినిమా డైలాగులు బాగానేఉన్నాయి కాని నాకు టోకరా యివ్వడానికి వాడకు. మళ్ళీ చెబుతున్నా స్పష్టంగా. ఇందాక నేపథ్యపు

సాంగు పాడింది. మీరాకాదు; మీరన్నాకాదు. నేను. నాపేరు నరసన్న బోధపడిందా?"

"పడిందఁడి...."

"సరే ఇంక అలా ఏడుస్తున్నపోజు మార్చెయ్యి. ఎందుకలా బెంగ పడడం?"

"మీరు చెప్పిన కథలు వింటే, భయం వేస్తోంది. దబాయించటం కొంచెంకూడా చేతకాదుగదా, ఈ 'పాపం పసివాడు' ఎలా ధాన్ని సంపాదించగలడా అని ఏడుపొస్తోంది". అన్నాడు రాజు వినమ్రుడై నవ్వుతూ.

నరసన్న పకపక నవ్వేసి, రాజు భుజంమీద చరిచాడు.

"మరేం ఫరవాలేదు. తప్పక పైకొస్తావు. ఏడుపొస్తోంది అన్నమాటని నవ్వుతూ సినిమాటిక్‌గా, స్టయిలిష్‌గా చెప్పగలిగావంటే నువ్వేమన్నా సాధించగలవు. నొసలు నిజం చెబితే నోరు అబద్ధం చెప్పాలన్నారు. ఆ సదుపాయం కోసమే దేముడు మనకి నోరు సప్లయి చేశాడుకదా. నోరు నిజం చెబుతే నొసలబద్ధమాడాలి. నీకీ విద్య వచ్చింది. వస్తా! భయపడకు. ఇంక ప్రపంచతంత్రం కాస్త నేర్చేసుకుంటే నీకు ధోకా ఉండదు" అన్నాడు నరసన్న గంభీరంగా.

రాజు నొసలే ప్రశ్న అడిగాయి. అదేమిటని.